క్లుప్తంగా

పరిహారం ఇవ్వాలి

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరు పరిధిలోని రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన కుటుంబాలకు పరిహారం ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక గంగసాగరం వద్ద జరిగిన ఘటనలో మృతి చెందిన వారి కుటుంబసభ్యులకు సంతాపం తెలుపుతున్నట్లు వివరించారు. ప్రైవేటు ట్రావెల్స్ యజమాన్యం ఒక్కొక్క కుటుంబానికి రూ.25 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. తరచూ ప్రైవేటు ట్రావెల్స్ వాహనాలతో ప్రమాదాలు జరుగుతున్నా తనిఖీలు చేయాల్సిన ఆర్టీఏ అధికారులు స్పందించడం లేదన్నారు.

పేదల చెంతకే వైద్యసేవలు


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా పేదల చెంతకే మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నట్లు స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని పత్తాపాటివారిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వాహనంలో వైద్యాధికారి 60 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గర్భిణులు, బాలింతలు, వృద్ధులు, బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు చేశారు. గర్భిణులు క్రమం తప్పకుండా గుండె, బీపీ, షుగర్ సంబంధిత పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత దూరం చేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏకసభ్య కమిషన్ పర్యటన విజయవంతం చేద్దాం


సమావేశమైన ఎమ్మార్పీఎస్ నాయకులు

పలమనేరు: ఎస్సీ వర్గీకరణపై విచారణకు ఈనెల 21న చిత్తూరుకు వస్తున్న రాజీవ్ రంజన్ మిశ్రా కమిషన్ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మాటూరి మురళి పిలుపునిచ్చారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ వద్ద శుక్రవారం స్థానిక నేతలతో కలసి సమావేశాన్ని నిర్వహించారు. మందకృష్ణ మాదిగ ప్రయత్నంతోనే కమిషన్ విచారణకు వస్తోందన్నారు. కచ్చితంగా ఎస్సీ వర్గీకరణ చేపట్టాలనే అంశాన్ని కమిటీ ముందు విన్నవించాలన్నారు. సమావేశంలో స్థానిక సంఘ నాయకులు ప్రకాష్, హరిక్రిష్ణ, జగన్నాద్, మణి, వినోద్, బాబు పాల్గొన్నారు.

పురివిప్పిన మయూరం


జగమర్ల- దేవళంపెంట రోడ్డు పక్కన నెమలి సోయగం

పలమనేరు: జగమర్ల సమీపంలో పలు నెమళ్లు శుక్రవారం పురివిప్పిన సోయగాలను కొందరు సెల్‌ఫోన్లలో బంధించారు. గతంలో ఈ ప్రాంతంలో వర్షాలు పడి అడవి పచ్చదనంతో నిండింది. సాయంత్రం వేళలో నెమళ్లు అడవిని దాటి వచ్చి జనానికి కనిపిస్తూ కనువిందు చేస్తున్నాయి. ఈ కౌండిన్య అభయారణ్యంలో నెమళ్ల సంతతి పదేళ్లలో పెరిగినట్లు అటవీ సమీప గ్రామస్తులు చెబుతున్నారు.

బ్యానర్‌ను ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలి


పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్న నాయకులు


శ్రీరంగరాజపురం: మండల కేంద్రంలో యు.ఎం.పురం గ్రామానికి చెందిన యువకులు, వైఎస్సార్ అభిమానులు సంక్రాంతి సందర్భంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్ బ్యానర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం జిల్లా క్రియాశీల కార్యదర్శి కుప్పయ్య, ఎంపీపీ సరిత జనార్దన్ స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రాజకీయ కక్షలతోనే కూటమి పార్టీలకు సంబంధించిన వ్యక్తులు ధ్వంసం చేశారన్నారు. బ్యానర్‌ను ధ్వంసం చేసిన వారిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ యువ కార్యదర్శి శ్రీధర్, యు.ఎం.పురం యువకులు పాల్గొన్నారు.

తపాలా బీమా ఎంతో ధీమా

- తపాలా ఖాతాదారులకు ప్రత్యేకం
- రూ.10 లక్షలు, రూ.15 లక్షలతో బీమా పాలసీలు
- 18 నుంచి 65 ఏళ్ల వరకు అర్హత



చిత్తూరులో ఏర్పాటు చేసిన బీమా బ్యానర్



చిత్తూరు కార్పొరేషన్: అనుకోకుండా జరిగేది ప్రమాదం.. ఏ క్షణాన ఏ రూపంలో దాపురిస్తుందో తెలియదు. అప్పుడు ఆస్పత్రులకు వెళ్తే లక్షల్లో బిల్లు చెల్లించాలి. జరగరానిది జరిగితే ఆ కుటుంబం అనాథగా మారుతుంది. వీటిని దృష్టిలో పెట్టుకొని పేద, మధ్య తరగతి వారికి అందుబాటులో ఉండేలా గ్రూప్ యాక్సిడెంట్ గార్డ్ పాలసీని ప్రవేశపెట్టింది. రూ.555 ప్రీమియంతో రూ.10 లక్షలు, రూ.755తో రూ.15 లక్షల బీమా పాలసీలను అందుబాటులోకి తెచ్చింది. పాలసీదారుడికి ఎలాంటి ప్రమాదం సంభవించినా బీమా తీసుకున్నప్పటి నుంచి ఏడాది పాటు కవరేజీ వర్తిస్తుంది. 18 నుంచి 65 ఏళ్ల మధ్య వయసుగల వారికి మాత్రమే ఇవి వర్తిస్తాయి. 2022 ఏప్రిల్లో తొలిసారి తపాలా శాఖ ఈ పథకాలను ప్రవేశపెట్టింది. పథకం ప్రయోజనాలు అధికంగా ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో పాలసీదారులు ఇందులో చేరడం లేదు. ఇప్పటికి 2 వేల మంది మాత్రమే జిల్లాలో ఈ ప్రీమియం తీసుకున్నారు.

ఇవి అర్హతలు

ఈ పాలసీలు పొందాలంటే ముందుగా పోస్టల్ బ్యాంక్ ఖాతా కలిగి ఉండాలి. ఖాతా లేనివారు రూ.200తో ప్రారంభించాలి. బీమా పాలసీకి రూ.555తో గానీ, రూ.755 గానీ చెల్లించాలి. ప్రమాదం సంభవించినప్పుడు మాత్రమే ఈ బీమా వర్తిస్తుంది. దీర్ఘకాలిక పక్షవాతం ఉన్నవారికి ఇది వర్తించదు. పాలసీ కోసం నగదు చెల్లించిన రోజు అర్ధరాత్రి 12 గంటల నుంచి బీమా రక్షణ లభిస్తుంది. పాలసీదారుకు ఒక బాండ్ కూడా అందిస్తారు.

ఉపయోగాలు ఇవి

- రూ.555, రూ.755 చెల్లిస్తే టాటా, స్టార్, ఆదిత్యబిర్లా, నివబూప, రిలయన్స్ వంటి సంస్థ ద్వారా బీమా పొందుతారు
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.10 లక్షలు, రూ.15 లక్షలు
- శాశ్వత, పాక్షిక వైకల్యం అయితే రూ.10 లక్షలు, రూ.15 లక్షలు
- పిల్లల విద్యా ప్రయోజనం కోసం రూ.50 వేలు, గృహ స్వస్థత రూ.7 వేలు, రూ.5 వేలు
- ప్రమాదం జరిగితే వైద్య ఖర్చులకు రూ.75 వేలు, రూ.లక్ష
- హాస్పిటల్ నగదు ప్రయోజనం రోజుకు రూ.వెయ్యి (రూ.6 వేల వరకు)
- దిగుమతి చేసుకున్న మెడిసిన్స్, రవాణా ఖర్చులకు రూ.12 వేలు, రూ.14 వేలు
- అంబులెన్స్, పార్థివ దేహాన్ని తరలించటానికి రవాణా ఖర్చులు రూ.11 వేలు, రూ.9 వేలు
- ఒక బంధువు కోసం ప్రయాణ ఖర్చు రూ.11 వేలు, రూ.9 వేలు
- రక్తం కొనుగోలుకు రూ.11 వేలు, రూ.9 వేలు, అంత్యక్రియల ఖర్చులు రూ.9 వేలు, రూ.7వేలు, అన్‌లిమిటెడ్ టెలీ కన్సల్టెన్సీ
- ప్రమాదం ఏ విధంగా చోటు చేసుకున్నా పాలసీ ఖచ్చితంగా వర్తించేలా నిబంధనలు రూపొందించారు. ప్రమాదం జరిగి మరణిస్తే సంబంధిత ఎఫ్ఐఆర్ కాపీ, పోస్టుమార్టమ్ రిపోర్టును తపాలా బ్యాంకులో అందజేయాలి.
- తదుపరి నామినీలకు మొత్తం పరిహారం ఇస్తారు. మొదట వైద్యం ఖర్చును పాలసీదారులు చెల్లించి ఆ బిల్లులు సమర్పించిన తరువాత ఖాతాదారులకు ఆ మొత్తం అందజేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రమాద బీమా పాలసీని అన్ని వర్గాలు ఉపయోగించుకోవాలి. తక్కువ మొత్తంతో ఎక్కువ లబ్ధి చేకూరుతుంది. ప్రమాదానికి గురై ఆస్పత్రిలో అడ్మిట్ అయితే రూ.లక్ష వైద్య ఖర్చులకు ఇస్తారు. మరణిస్తే రూ.10 లక్షలు, రూ.15 లక్షలు చెల్లిస్తారు. వీటి కోసం 5 బీమా కంపెనీలతో ఒప్పందం చేసుకున్నాం. ఎక్కువగా రైతులు, డ్రైవర్లు, వాహనాల్లో ఎక్కువ ప్రయాణం చేసేవారికి ఇది ఉపయోగం. వీరే కాకుండా అందరూ వీటిని వినియోగించుకుంటే ప్రమాదం జరిగినప్పుడు మీ కుటుంబానికి భరోసాగా ఉంటుంది.

–నాగార్జున, మేనేజర్ ఐపీపీబీ

శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

తవణంపల్లె: మండలంలోని దిగువమాఘంలో అమరరాజ సంస్థల సౌజన్యంతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన అమర రాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్(ఎఆర్ఎస్‌డీసీ)లో నిరుద్యోగ యువతకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు పీఆర్‌ఓ బాబ్జీ తెలిపారు. సర్ఫేస్‌మౌంట్ టెక్నాలజీ, పీసీబీ అసెంబ్లీ ఆపరేషన్ కోర్సులో 24 నెలల పాటు శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణ కాలంలో రూ.12,072 స్టైఫండ్ అందిస్తామని పేర్కొన్నారు. ఇంటర్, పదవ తరగతి ఉత్తీర్ణులైనా లేదా ఫెయిలైన వారు అర్హులన్నారు. ఈ నెల 20వ తేదీన దిగువమాఘంలో అమరరాజ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరుకాగలరని వెల్లడించారు. పూర్తి వివరాలకు 87126 08589, 97392 90499, 88072 26264ను సంప్రదించాలని కోరారు.

వచ్చిన అర్జీలను పరిష్కరిస్తాం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కరిస్తామని రూరల్ తహసీల్దార్ లోకేశ్వరి అన్నారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. మండలంలో రెవెన్యూ సమస్యలకు సంబంధించి మొత్తం 194 అర్జీలు వచ్చాయన్నారు. ఇందులో భూములు, దారి సమస్యలు, పట్టా మార్పులు, సర్వే తదితర సమస్యలు వచ్చాయన్నారు. వీటిని పూర్తి స్థాయిలో విచారించి పరిష్కరించేలా చూస్తామని ఆమె పేర్కొన్నారు.

నేడు సామాజిక తనిఖీ

తవణంపల్లె: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం సామాజిక తనిఖీ కో–ఆర్డినేషన్ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రెడ్డిబాబు తెలిపారు. 01.04.2023 నుండి 31.03.2024 వరకు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో చేపట్టిన పనులకు 17వ విడత సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని గ్రామ పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల సామాజిక తనిఖీ కోసం 10 మంది డీఆర్‌పీలు, ఒక ఎస్ఆర్‌పీ విచ్చేసినట్లు వివరించారు. చేపట్టిన పనుల పూర్తి వివరాలతో అధికారులు సమావేశానికి హాజరుకావాలని ఆయన కోరారు.

మురుగునీటి గుంతను పట్టించుకోరా?


మురుగు నీటి గుంతలో పడ్డ ద్విచక్ర వాహనం

బంగారుపాళెం: మండల కేంద్రంలో మురుగునీటి గుంత ప్రమాదకరంగా మారింది. బంగారుపాళ్యానికి చెందిన హజరత్ శుక్రవారం ద్విచక్రవాహనంపై వెళ్తూ ఈ గుంతలో పడిపోయాడు. స్థానికులు హజరత్‌ను గుంతలో నుంచి బయటకు తీశారు. ఈ నెల 2వ తేదీ వడ్డూరుకు చెందిన వ్యక్తి ఇదే గుంతలో పడి ఆస్పత్రి పాలయ్యాడు. పాత పోస్టాఫీస్ రోడ్డు నుంచి రహదారి మీదుకు వెళ్లే రోడ్డు పక్కనే ఈ గోతి ఉంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. పంచాయతీ అధికారులు గోతి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టక పోవడం మూలాన ప్రమాదవశాతు పలువురు ప్రమాదాలకు గురవుతున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 10 మందికి పైగా పడిపోయారని అంటున్నారు. ఇప్పటికైనా స్పందించి రహదారి ప్రక్కన ప్రమాదకర గోతి చుట్టూ రక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శ్మశాన వాటికలపై నివేదికలు సమర్పించాలి


టేకుమందలో శ్మశాన వాటిక స్థలం సర్వే చేస్తున్న రెవెన్యూ అధికారులు

బంగారుపాళెం: మండలంలోని ఎస్సీ ఎస్టీలకు సంబంధించిన శ్మశాన వాటికల నివేదికలను సమర్పించాలని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్‌ఓలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశాన్ని నిర్వహించారు. మండలంలో ఎస్సీ, ఎస్టీల గ్రామాల్లో శ్మశాన వాటికలకు సంబంధించి స్థలాన్ని పరిశీలించి సర్వేచేసి హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. గ్రామాల్లో శ్మశాన వాటికల్లో ఎవరైనా ఆక్రమణదారులు ఉంటే అటువంటి వ్యక్తులు స్వచ్ఛందంగా ఆ స్థలం వదలుకోవాలని సూచించారు. శ్మశాన స్థలాల సర్వేకు ఆటంకం కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో పలువురు ఎస్సీ ఎస్టీలు శ్మశాన స్థలాల దురాక్రమణపై ఫిర్యాదులు ఇచ్చారన్నారు. శ్మశాన వాటికలకు సంబంధించి మంగళవారంలోపు నివేదికలు అందించాలని కోరారు.

ఖాళీ బిందెలతో నిరసన


కుప్పనపల్లెలో నిరసన తెలుపుతున్న మహిళలు

బైరెడ్డిపల్లె: గుక్కెడు నీటి కోసం ఇబ్బందులు పడుతున్నామని మండలంలోని కుప్పనపల్లె ఎస్సీ కాలనీ మహిళలు శుక్రవారం ఖాళీ బిందెలతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మహిళలు మాట్లాడుతూ.. కుప్పనపల్లె ఎస్సీ కాలనీలో సుమారు 90 గృహాలు ఉన్నాయన్నారు. కాలనీకి చేతి పంపు ఏర్పాటు చేయడంతో అందులో నీరు పట్టుకునేవారమన్నారు. అయితే 6 నెలల కిందట విద్యుత్ బోరు మోటారు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పి ఉన్న చేతి పంపును తొలగించారన్నారు. ఇప్పటి వరకు బోరు మోటారు ఏర్పాటు చేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడిందని వాపోయారు. గతంలో ఉన్న చేతిపంపునైనా వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. తాగునీటి సమస్య పరిష్కరించకపోతే మండల కేంద్రంలో ధర్నా చేస్తామని హెచ్చరించారు.

కోకో సాగుతో అధిక లాభాలు


గొల్లపల్లెలో రైతు సాగు చేసిన కోకో పంటను పరిశీలిస్తున్న మధుసూదన్‌రెడ్డి

బంగారుపాళెం: రైతులు కోకో పంట సాగుతో అధిక లాభాలు పొందవచ్చని జిల్లా ఉద్యాన శాఖాధికారి మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని గొల్లపల్లెలో రైతు వెంకటరమణ కొబ్బరితోటలో అంతర సాగుగా వేసిన కోకో పంటను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, కొబ్బరి తోటల్లో రైతులు కోకోను అంతర పంటగా సాగు చేసుకోవడం వల్ల ఆర్థిక ప్రయోజనాలు పొందేందుకు అవకాశాలు ఉన్నాయని తెలిపారు. రైతులకు అవసరమైన మొక్కలను ఉద్యానశాఖ ద్వారా ప్రైవేట్ కంపెనీ నుంచి సరఫరా చేస్తారన్నారు. ఒక మొక్క 18 రూపాయలకు విక్రయిస్తున్నట్లు తెలిపారు. రైతులు పండించిన కోకో పంటను కంపెనీ వారే కొనుగోలు చేస్తారని వివరించారు. కోకో సాగుకు ప్రభుత్వం రాయితీ కల్పిస్తోందన్నారు. ఎకరాలో 200 మొక్కలను నాటుకోవచ్చన్నారు. ఐదేళ్లకు పంట మొదలవుతుందని చెప్పారు. అటు నుంచి 30 ఏళ్ల వరకు పంట వస్తుందన్నారు. ఒక్కొక్క చెట్టుకు 3 నుంచి 4 కిలోల వరకు కోకో బీన్స్ వస్తుందన్నారు. పంటను చీడపీడల బాధ పెద్దగా ఉండదని చెప్పారు. ఎకరాకు 600 నుంచి 800 కేజీల వరకు వస్తుందన్నారు. మార్కెట్‌లో కిలో కోకో బీన్స్ రూ.600 పలుకుతోందని వివరించారు. ఈ లెక్కన ఏడాదికి రూ 3.60 లక్షల ఆదాయం వస్తుందని చెప్పారు. రైతులు కొబ్బరి తోటల్లో అంతర పంటగా కోకో సాగుపై దృష్టి సారించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఓ సాగరిక పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

చిత్తూరు రూరల్(కాణిపాకం): రోడ్డు భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని మురకంబట్టు ప్రాంతంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు డీటీసీ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు శిబిరం ప్రారంభమవుతుందన్నారు. ప్రధానంగా కంటి వైద్యపరీక్షలు ఉచితం చేస్తారని చెప్పారు. హెల్త్ చెకప్ కూడా ఉంటుందన్నారు. వాహనదారులు, ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే గర్భవతులకు ఆరోగ్యం


వైద్యసేవలందిస్తున్న డాక్టర్ మోహన్‌వేలు

తవణంపల్లె: పోషక విలువలు కలిగిన పౌష్టికాహారంతోనే గర్భిణులకు ఆరోగ్యమని డాక్టర్ మోహన్‌వేలు తెలిపారు. మండలంలోని జి.గొల్లపల్లె, నల్లపురెడ్డిపల్లెలో శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మోహన్‌వేలు మాట్లాడుతూ గర్భిణులు వ్యక్తిగత శుభ్రతతో పాటు రక్తహీనత రాకుండా ఐరన్ మాత్రలు వాడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇచ్చే పౌష్టికాహారం ఆరోగ్యానికి చాలా మంచిదని సూచించారు. ఆస్పత్రిలో ప్రసవం తల్లీబిడ్డకు క్షేమమని వివరించారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచుకోవాలన్నారు. అనంతరం గర్భిణులు, బాలింతలు, చిన్నారులు, బీపీ, సుగర్ వ్యాధిగ్రస్తులు, వృద్ధులకు పరీక్షలు చేయించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశాకార్యకర్తలు, రోగులు పాల్గొన్నారు.

కార్పొరేట్ గవర్నెన్స్ ప్రమాదకరం

చిత్తూరు కార్పొరేషన్: డేటా రక్షణ చట్టం లేకుండా 150 రకాల పౌర సేవలను వాట్సాప్ ద్వారా అందించటం ప్రమాదకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి గంగరాజు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఇది పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమేనన్నారు. ఇందుకోసం వాట్సాప్ కంపెనీతో రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. ఏదైనా ఒక సర్టిఫికేట్ కావాల్సివస్తే దానికి సంబంధించిన డాక్యుమెంట్లు అందులో అప్‌లోడ్ చేయాలన్నారు. అవి భద్రంగా ఉంటాయన్న చట్టభద్రత లేదన్నారు. 2018 నుంచి డేటా ప్రైవసీ చట్టం పెండింగులోనే ఉందన్నారు. ఈ ఒప్పందంతో సచివాలయ సిబ్బందిని తగ్గించాలన్న యోచనలో ప్రభుత్వం ఉందన్నారు. గోప్యంగా ఉండాల్సిన పౌరుల వ్యక్తిగత సమాచారాన్ని కార్పొరేట్ సంస్థ పరం చేయడంపై అభ్యంతరం తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ సుధారాణి

చిత్తూరు రూరల్(కాణిపాకం): చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో శుక్రవారం పబ్లిక్‌హెల్త్ అండ్ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ క్యాలెండర్లను ఆవిష్కరించారు. డీఎంహెచ్‌ఓ సుధారాణి చేతుల మీదుగా క్యాలెండర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీనారాయణ, బొగేశ్వర పిళ్లై, చంద్రశేఖర్, శ్రీనివాసమూర్తి, సతీష్ పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

పూతలపట్టు (కాణిపాకం): పూతలపట్టు మండల సర్వసభ్య సమావేశాన్ని శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది హాజరు కావాలని ఆయన కోరారు.

కోలాహలంగా ఎడ్ల పందాలు


కోడెగిత్తను నిలువరిస్తున్న యువకులు


పౌరుషంగా దూసుకువస్తున్న ఎద్దును నిలువరించేందుకు ప్రయత్నిస్తున్న యువత

ఐరాల: మండలంలోని చెంగనపల్లెలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా శుక్రవారం కోలాహలంగా ఎద్దుల పోటీలను గ్రామస్తులు అట్టహాసంగా నిర్వహించారు. గ్రామంతో పాటు పరిసర గ్రామాల నుంచి ఎద్దులను తీసుకొచ్చారు. గోవులను, ఎద్దులను నీరుతో శుభ్రం చేయించి, కొమ్ములకు రంగులు వేశారు. పూలమాలలు, రంగు కాగితాలు, గిత్తల కొమ్ములకు పట్టీలు కట్టి, గాలి బుడగలతో అలంకరించి, ఆలయం వద్ద పూజలు చేశారు. అనంతరం ముస్తాబు చేసిన కోడెగిత్తలను, ఎద్దులను పరుగులు పెట్టించారు. వీటిని నిలువరించేందుకు యువకులు, పెద్దలు నువ్వానేనా అనే విధంగా పోటీపడ్డారు. తాళ్లతో కట్టిన ఎద్దులు పౌరుషంగా రంకెలేస్తూ జనసమూహం వైపు దూసుకుపోయాయి. పట్టీల కోసం యువకులు ఉత్సాహంగా పోటీపడ్డారు. పట్టీలను దక్కించుకున్న యువకులు విజయోత్సాహంతో కేరింతలు కొట్టారు. ఈ పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్దసంఖ్యలో జనం హాజరు కావడంతో గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది.